Walidain Aur Aulad ke
Huquq Aur Faraiz (Telugu)

తల్లిదండ్రులు, సంతానం-
హక్కులు, బాధ్యతలు

మూలం
మౌలానా యూసుఫ్ ఇస్లాహి

అనువాదం
ముహమ్మద్ ఉస్మాన్‌ఖాన్

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

తల్లిదండ్రులు, సంతానం-హక్కులు, బాధ్యతలు

అల్లాహ్ సృష్టిశాసనం ప్రకారం మానవుడు ఈ భూ ప్రపంచంపై అడుగిడినప్పుడు మొట్టమొదట అతనికి తల్లిదండ్రులతోనే పరిచయ సంబంధాలు ఏర్పడతాయి. శిశువు ఈ పుడమిపై కళ్ళు తెరవడానికి కారణమైన వీరిద్దరూ, ఆ చిన్నారిపై అపరిమితమైన ప్రేమానురాగాలు కలిగి, అతనికోసం తమ సర్వస్వాన్నీ ధారపోయడానికి సిద్ధంగా ఉంటారు. ఆ శిశువు వీరిద్దరి ప్రేమాభిమానాలకు కేంద్రబిందువుగా మారిపోతాడు. ఇహపరలోకాల సంపదంతా తమకే లభించినట్లు, ఆ చిన్నారి జననం పట్ల వారు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తారు. ఆ చిన్నారిని వారు దైవం ప్రసాదించిన అపూర్వమైన కానుకగా భావించి, ప్రాణప్రదంగా చూసుకుంటారు. ఆ బోసినవ్వుల పసివాణ్ణి పెంచి, పోషించి ఉన్నత శిఖరాలకు చేర్చడానికి తమ ధనప్రాణాలను, తమ సుఖసంతోషాలను తృణప్రాయంగా త్యాగం చేస్తారు. పిల్లవాడు ముద్దుముద్దుగా, బొద్దుబొద్దుగా, నవ్వుతూ, తుళ్ళుతూ పిల్లచేష్టలు చేస్తుంటే వారు తమ కష్టాలన్నింటినీ మరిచిపోతారు. హృదయపు లోతులనుండి దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తూ ఈ చిన్నారి కలకాలం ఇలాగే నవ్వుతూ, నవ్విస్తూ, సంతోషంగా జీవితం గడపాలని దైవాన్ని వినమ్రంగా వేడుకుంటారు. దురదృష్టవశాత్తూ అతడికి ఏకాస్త సుస్తీ

చేసినా వారు తల్లడిల్లిపోతారు. వారి సంతోషమంతా ఆవిరైపోతుంది. ఈ చిన్నారి ఉనికి వారి ప్రేమాభిమానాలకు, వారి సత్కార్యాలకు, వారి త్యాగాలకు మూలబిందువ వుతుంది. ఈ చిన్నారి ఉనికిని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి, వారు తమ సర్వస్వాన్నీ త్యాగం చేయడానికి సంతోషంగా సిద్ధమవుతారు. అతడి జీవితం సుఖప్రదమైన జీవితం కావాలని వారు కడు వినమ్రంగా, దీనంగా అల్లాహ్‌ను వేడుకుంటారు.

ఇస్లామీ కుటుంబంలో శిశు జననం

అదృష్టవశాత్తూ ఒక శిశువు ముస్లింల ఇంట జన్మించినట్లయితే మొట్ట మొదట అతని చెవిలో 'అల్లాహు అక్బర్' అన్న శబ్దం వినిపించబడుతుంది. అంటే, అల్లాహ్ ఔన్నత్యం, ఆయన గొప్పదనం, ఆయన ఏకత్వ సందేశం నవశిశువు నిర్మల మనోమస్తిష్కాలపై ముద్రవేసే ప్రయత్నం జరుగుతుంది. ఇది అల్లాహ్ హక్కుల్లో అన్నింటికన్నా గొప్ప మరియు ప్రప్రథమ హక్కు. ఎందుకంటే, ఆయనే సృష్టికర్త, యజమాని. ఆరాధనలకు అర్హుడు ఆయన ఒక్కడే. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత త్వరగా శిశువు కుడిచెవిలో 'అజాన్' పలకాలన్నది షరియత్ ఆదేశం. 'అజాన్' పలకడమంటే, దేవుని ఏకత్వం, ఆయన ఔన్నత్యం, ఆయన దాస్యం మరియు ముహమ్మద్ ప్రవక్త(స) దైవదౌత్యాల సాక్ష్యం పలకడమన్నమాట.

కుడిచెవిలో 'అజాన్' ధ్వని వినిపించిన వెంటనే ఎడమ చెవిలో 'ఇఖామత్' చెప్పబడుతుంది. 'ఇఖామత్'కు అసలు అర్థం ఏమిటంటే, 'నమాజు స్థాపన కోసం' (నమాజు కోసం) నిలబడండి అని ప్రకటించడమన్న మాట. కనుక అన్నివైపుల నుండి మనసు మరల్చుకొని, పూర్తి ఏకాగ్రతతో అల్లాహ్ వైపునకే మనసు మరల్చుకునే సమయమిది. ఈ సమయం

ఇకామత్ పలికి, జమాత్ నిలబడిందని ప్రకటించబడిన నమాజుకే పరిమితం. ఇఖామత్ లేని నమాజు జనాజా నమాజే అవుతుంది. అంటే ఇప్పుడు నమాజులేకుండా పలికే ఇఖామత్ ఆ శిశువు, తరువాత మరణించినప్పుడు చేసే జనాజా నమాజుకు ఇఖామత్ కాగలదు. జీవితం అనే ఈ విరామం, ఇఖామత్ మరియు జనాజా నమాజుల మధ్య 'విరామ నిరీక్షణ' అన్నమాట. ఈ విరామ నిరీక్షణా సమయమే మానవుడి పూర్తి జీవితకాలం. దీన్ని ఇఖామత్ మరియు నమాజు మధ్య మానవుడు ఏ విధంగా ఏకాగ్రతతో, దైవంతో మనసు లగ్నం చేసి గడుపుతాడో ఆవిధంగా గడపాలి. దుఆ చదువుతూ కూడా మనిషి ఈ విషయాన్నే ప్రకటిస్తాడు.

"ఇన్నీ వజ్జహ్తు వజ్హియలిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫం వమా అన మినల్ ముష్రికీన్."

"నేను పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాలను సృష్టించినవానివైపు మరలాను. నేను బహుదైవారాధకుణ్ణి (ముష్రిక్‌ను) ఎంతమాత్రం కాను." (అన్ ఆమ్: 79)

జీవితం, జీవిత విరామం అంటే ఏమిటి? అజాన్, ఇకామత్, జనాజా నమాజ్ ఇవి మూడూ సాధారణ మాటలే. కాని ఇదే అసలు జీవిత సారాంశం. అంటే, ఇకామత్ తరువాత నమాజు నిరీక్షణలో మానవుడు ఏ ఆలోచనలతో, ఏ స్థితిలో, ఏ రూపంలో ఉంటాడో అతని ఈ 'జీవిత కాలం' కూడా అవే ఆలోచనలు, అదే స్థితి అదేరకంగా గడవాలి. జీవితంలోని సమస్త బాధ్యతలను సమర్థవంతంగా, సంపూర్ణంగా నెరవేర్చుతూ, పరిపూర్ణ ఏకాగ్రత మాత్రం కేవలం అల్లాహ్‌కే పరిమితం చేయాలి.

ముస్లిముల ఇంట శిశువు పెంపకం

ఇస్లామీ కుటుంబంలో పిల్లవాని పెంపకం, సహజ సిద్ధమైన, ప్రకృతి సిద్ధమైన, ధర్మశాస్త్ర విధానం ప్రకారం కొనసాగుతుంది. శిశువు జన్మించగానే

సృష్టి మూలసత్యాలను, దాని అసలు యదార్థాన్ని మానవ విలువల ప్రాముఖ్యతను అతనికి ఎరుకపరిచి, వాటిని స్వీకరించే విధంగా వివేకవంత మైన ప్రయత్నం ప్రారంభమవుతుంది. ఇస్లాం ఒక సహజసిద్ధమైన విజ్ఞాన శాస్త్ర ధర్మం. దీన్ని దైవం అవతరింపజేశాడు. అందుకని మానవుడి స్వభావం, అతడి బుద్ధి, క్షణకాలం కోసమైనా ఈ బోధనలను అపరిచిత మైనవిగా భావించదు.

ముస్లింల ఇంట మొదటి పాఠం దైవారాధన

దైవం మానవుణ్ణి సృష్టించాడు. సృష్టికార్యంలో మరెవరి భాగ స్వామ్యం లేదు. ఇది నిస్సందేహం. ఆ కరుణామయుడైన సృష్టికర్తే మానవుణ్ణి ఎంతో అందంగా, అపూర్వంగా ఎన్నో ప్రతిభాపాటవాలు, శక్తి సామర్థ్యాలు గలవాడుగా తీర్చిదిద్ది, సృష్టికే మకుటాయమానంగా మలిచాడు. సృష్టికర్తా ఆయనే, యజమానీ ఆయనే. కాబట్టి మానవుడు వేరెవరి దాస్యమూ చేయక ఆయన్నే ఆరాధించాలి, ఆయన్నే పూజించాలి. ఆయనకే భయపడాలి. ఇది ఆయన నిర్ణయం. నిర్ణయమంటే మామూలు నిర్ణయంకాదు, తిరుగులేని నిర్ణయం.

మానవుడు ఈ ప్రపంచంలోకి రావడానికి అతని తల్లిదండ్రులు కారణమన్నది ఒక వాస్తవం. ఎంతో గౌరవనీయులైన ఈ ఇద్దరు ప్రేమ మూర్తులు అతడి పోషణ, పెంపకం విషయంలో తమ రేయింబవళ్ళ సుఖశాంతులు, శక్తిసామర్థ్యాలను వెచ్చించారు. ఎన్నో కష్టనష్టాలకోర్చుకొని, తమ ధనసంపదలను త్యాగం చేసి ఆ చిన్ని అస్తిత్వాన్ని వృద్ధిలోకి తీసు కొచ్చారు. వారి చల్లని కారుణ్యఛాయలోనే శిశువు యవ్వన రుతువులోకి అడుగుపెడతాడు. ఫలవంతమైన జీవన పరుగులో పాలుపంచుకుంటాడు. ఎన్నో రంగాలను సంస్కరించాలన్న లక్ష్యంతో కార్యాచరణ రంగంలోకి

దిగుతాడు. ప్రపంచ సౌందర్యంలో తనవంతుగా మరిన్ని రంగులద్దే స్థాయికి చేరుకుంటాడు. కనుక మానవుడిపై అతడి తల్లిదండ్రుల హక్కు అన్ని హక్కులకన్నా గొప్పది. అల్లాహ్ హక్కు తరువాత, అన్నిటికంటే ముందు తల్లిదండ్రుల హక్కు నెరవేర్చాలని అంటే వారిపట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని అల్లాహ్ ఆదేశించాడు.

అల్లాహ్ తరువాత అన్నిటికన్నా గొప్ప హక్కు తల్లిదండ్రులదే

దేవుని ఏకత్వం, ఆయన ఔన్నత్యం, కేవలం ఆయన ఆరాధన తరువాత తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన, వారిపట్ల గౌరవం, విధేయతలకు సంబంధించి పవిత్ర ఖుర్ఆన్ ఎంతో ప్రభావవంతంగా, సువిప్లవాత్మకంగా, హృదయాలను కదిలించే విధంగా స్పష్టమైన హితవులు గరిపింది, ఉపదేశాలు చేసింది. మానవ హృదయంలో ఆత్మ సజీవంగా ఉన్నట్లయితే, అతడు ఈ హితబోధలను తన హృదయఘోషగా భావిస్తాడు. తద్వారా అతడు హృదయ చైతన్యంతో పవిత్ర ఖుర్ఆన్ చెప్పిందే చేస్తాడు. పవిత్ర ఖుర్ఆన్‌లో దైవాదేశం ఇలా ఉంది:

"వఖజారబ్బుక అల్లాతఅబుదూ ఇల్లాఇయ్యాహు వబిల్ వాలిదైని ఇహ్సానా"

"మీరు ఒక్క అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లి దండ్రుల పట్ల సత్ప్రవర్తనతో మెలగండి. ఇది అల్లాహ్ నిర్ణయం."

(బనీ ఇస్రాయీల్: 23)

పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులో అసాధారణ ప్రాముఖ్యంతో, తిరుగులేని విధంగా రెండు అత్యంత ప్రముఖమైన అంశాలను గురించి నొక్కిచెప్పడం జరిపింది:

1. మానవుడిపై అన్నిటికన్నా గొప్ప హక్కు అల్లాహ్‌కు ఉంది. అల్లాహ్ హక్కు ఏమిటంటే, కేవలం ఆయన్ను మాత్రమే ఆరాధించాలి. ఆయన తప్ప మరెవరినీ ఆరాధించకూడదు.

2. దీని తరువాత అంతే ప్రభావవంతంగా మరో విషయం చెప్ప బడింది. అదేమిటంటే, అల్లాహ్ తరువాత అన్నిటికంటే గొప్ప హక్కు తల్లిదండ్రులహక్కు. తల్లిదండ్రులహక్కు అంటే, వారిపట్ల సద్భావనతో మెలగాలి. ఎలాంటి సత్ప్రవర్తనకు వీరు హక్కుదారులో, అలాంటి ప్రవర్త నకు ఇతరులెవ్వరూ అర్హులు కారు. ఈ హక్కును కారుణ్యమూర్తి ముహమ్మద్ ప్రవక్త(స) ఎంతో రమ్యంగా, ప్రభావంతంగా వివరించారు. ఆ శైలి కేవలం దైవప్రవక్త(స)కు మాత్రమే పరిమితం.

దైవప్రవక్త (స) మాటల్లో తల్లిదండ్రుల హక్కు

హజ్రత్ అబూ ఉమామ(రజి) ఉల్లేఖనం ప్రకారం, ఒక వ్యక్తి దైవప్రవక్త(స) వారిని ఇలా ప్రశ్నించాడు:

"దైవప్రవక్తా! పిల్లలపై తల్లిదండ్రుల హక్కు ఏమిటి?"

"మీకోసం స్వర్గమైనా, నరకమైనా మీ తల్లిదండ్రులే" అని సెల విచ్చారు దైవప్రవక్త(స). (ఇబ్నెమాజ, మిష్కాత్)

అంటే, పవిత్ర ఖుర్ఆన్, హదీసుల్లో పేర్కొనబడిన తల్లిదండ్రుల హక్కుల్ని నెరవేరిస్తేనే నువ్వు స్వర్గానికి పోగలుగుతావు. వారి హక్కుల్ని విస్మరించి అల్లాహ్‌ను సంతోషపెట్టడం అసాధ్యం. అల్లాహ్ ప్రసన్నుడైతే స్వర్గం, ఆయన ఆగ్రహిస్తే నరకం. కాబట్టి తల్లిదండ్రుల హక్కుల్ని నెరవేర్చితే అల్లాహ్ ప్రసన్నుడవుతాడు. అల్లాహ్ ప్రసన్నుడయితే స్వర్గం లభిస్తుంది. లేకపోతే నరకమే.

తల్లిదండ్రుల వృద్ధాప్యం, సంతానం బాధ్యత

'ఇమ్మాయబ్‌లుగన్న ఇన్‌దకల్ కిబర అహదుహుమా అవ్ కిలా హుమా ఫలాతఖుల్లహుమా ఉఫ్ఫి(న్వలా తన్‌హర్ హుమా వ ఖుల్ల హుమా ఖౌలన్ కరీమా. వ ఖ్ ఫిజ్‌లహుమా జనా హజ్జుల్లి మినర్రహ్మతి వఖుర్రబ్బిర్ హుంహుమా కమా రబ్బయానీ సగీరా." (బనీ ఇస్రాయీల్: 23, 24)

"తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి. దయార్ద్ర హృదయంతో, వినయంతో వారిముందు నిలబడండి. (వారిపట్ల గౌరవా దరణలతో) "ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్స ల్యంతో పెంచిపోషించారో అలాగే నీవు వీరిని కరుణించు." అని ప్రార్థించండి.

తల్లిదండ్రుల కారుణ్యఛాయలో పిల్లవాడు ఎదిగి, కుటుంబ, సామాజిక బాధ్యతలను చేపట్టి వాటిని సక్రమంగా నెరవేర్చేస్థాయికి చేరుకోగానే తల్లిదండ్రుల వృద్ధ దశ ప్రారంభమవుతుంది. శరీరంలో శక్తి ఉడిగిపోతుంది. భావాలు, ఆలోచనల్లో ప్రభావశీలత బలహీనపడుతుంది. ఏమైనా చేద్దామన్నా వయసు సహకరించదు. వృద్ధాప్యం వారి సమస్త కార్యాలపై ప్రభావం చూపుతుంది. వారి జీవితం నిస్సహాయ నిరాధార జీవితమవుతుంది. తల్లిదండ్రుల జీవితంలోని ఈ చివరిదశే వారి సంతా నానికి పరీక్షా కాలం. తమ పరలోక జీవితం బాగుచేసుకోడానికి, స్వర్గంలో అత్యున్నత స్థానాలను సొంతం చేసుకోడానికి ఈ కాలం వారికి చాలా విలువైన కాలంగా పరిణమిస్తుంది.

ఈ దశలోనే వృద్ధ తల్లిదండ్రులు ఆత్మస్థయిర్యాన్ని కోల్పోయి, నిరాశా నిస్పృహలకు లోనై, ఊహించని విధంగా కొన్ని అగౌరవ చేష్టలకు పాల్పడుతుంటారు. వృద్ధాప్యం వల్ల రోజురోజుకూ ఆరోగ్యం క్షీణించడం వల్ల అసహనం, చిరాకు జనిస్తుంది. ఏకొద్ది మాటనైనా ఇట్టే పట్టుకుంటారు. మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, పట్టించుకోవడంలేదని, ఏ విషయంలోనూ సంప్రదించడంలేదని గింజుకుంటూ ఉంటారు. అందుకని తమ ఉనికిని, తమ ప్రాముఖ్యతను తెలియపరచడానికి కూడా కొన్నికొన్ని సందర్భాల్లో వింత కోరికలు కోరుతుంటారు. ఇలాంటి గొంతెమ్మ కోరికలు పిల్లలకు సహించకపోవచ్చు. కొన్ని సమయాల్లో ఆత్మన్యూనతా భావంవల్ల, ఆందోళనకు లోనై మంకుపట్టు పడుతూ ఉంటారు. పంతాలకు పట్టింపులకు పోతూ ఉంటారు.

ఇలాంటి సున్నిత సందర్భాల్లో కూడా, 'మిమ్మల్ని మీరు నిగ్రహించుకోండి, వారిని 'ఉఫ్' అని కూడా చీదరించుకోకండి' అని పవిత్ర ఖుర్ఆన్ హితవు గరిపింది. వారి ప్రవర్తన వల్ల సహనం కోల్పోయి, వారిని చీదరించుకోకండి అని ఉపదేశించింది. దీనికి భిన్నంగా వారిపట్ల గౌరవభావంతో, వినయవిధేయతలతో అణిగిమణిగి ఉండండి. వారితో మాట్లాడుతున్నప్పుడు వారి పెద్దరికాన్ని, వారి ఔన్నత్యాన్ని దృష్టిలో ఉంచుకొని మాట్లాడండి. వారు మీకు జన్మనిచ్చిన గౌరవనీయ తల్లిదండ్రులని, మీరు వారి సంతానమన్న విషయాన్ని ఎప్పుడూ మరవకండి. వారు ఎంతో ప్రేమ, వాత్సల్యాలతో తమ సర్వస్వాన్ని మీకోసం త్యాగం చేసి, తమ శక్తిసామర్థ్యాలను మీకు అర్పితం చేశారు అని చెబుతుంది.

ఈ సంతాన బాధ్యతలు నెరవేర్చుతూ, దాంతోపాటు దైవసన్నిధిలో వారికోసం హృదయపులోతుల్లోంచి ప్రార్థనలు కూడా చేయండి. 'పరాత్పరా!

ఒక దశలో నేను చాలా చిన్నవాణ్ణి. ఏమీ చెప్పలేని, చెయ్యలేని నిస్సహాయుణ్ణి. అలాంటి నిస్సహాయస్థితిలో వీరు నన్ను ఆదరించి, తమ ప్రేమను నాపై కుమ్మరించారు. నా కోసం వారు తమ సుఖసంతోషాలను త్యాగం చేసి నాకు కాస్తంత కూడా బాధ కలుగకుండా కంటికి రెప్పలా కాపాడారు. ప్రభూ! ఈ రోజు వీరు వృద్ధాప్యం కారణంగా అలాంటి నిస్సహాయస్థితినే అనుభవిస్తున్నారు. నా బాల్యంలో వారు నన్ను కరుణించినట్లు, వారి వృద్ధాప్యంలో నువ్వు వారిని కరుణించు. వారి బాధలను దూరంచేయి. వారికి సుఖశాంతులు ప్రసాదించు అని ప్రార్థించాలి.

వృద్ధ తల్లిదండ్రులకు సేవచేసి, వారిపట్ల సద్భావంతో మెలిగే అవకాశం గనక వచ్చినట్లయితే, దీన్ని తమ పరలోక జీవితం తీర్చిదిద్దుకునే ఒక సువర్ణ అవకాశంగా భావించాలని పవిత్రఖుర్‌ఆన్ సంతానానికి హితవు చెబుతోంది. వారి పెద్దరికానికి, వారి గౌరవానికి భంగం కలిగే ఎలాంటి మాటగాని, చేతగాని తమవల్ల సంభవించకూడదని ఎప్పటికప్పుడు తమ మాటల్ని చేతల్ని బేరీజు వేసుకుంటూ ఉండాలని ఉపదేశిస్తోంది.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సేవ స్వర్గానికి మార్గం

ఖుర్‌ఆన్ వాక్యాల లోతుల్లోకి సంపూర్ణంగా వెళ్ళిన దైవప్రవక్త(స) ఈ ఆయతులను తన పదాల్లో ఎంతో ఉపదేశాత్మకంగా ఇలా వివరించారు:

హజ్రత్ అబూహురైరా(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు.

'ఆ మనిషి పాడుగాను.... ఆ మనిషి పాడుగాను.... అతను అవమానం పాలుగాను.'' అని దైవప్రవక్త(స) ముమ్మారు పలికారు.

అది విని, ''దైవప్రవక్తా! ఎవరతను?'' అని సహచరులు అడిగారు.

"ఎవరైతే తన తల్లిదండ్రులను, ఒకరినిగాని లేక ఇద్దరినిగాని వృద్ధదశలో పొంది కూడా స్వర్గంలోకి వెళ్ళనివాడు" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రుల సేవచేసే అదృష్టం గనక వరిస్తే దాన్ని స్వర్గాన్ని సాధించే ఒక అమూల్య అవకాశంగా భావించి, హృదయ పూర్వకంగా, స్వర్గం పొందే ఈ అవకాశం ఎక్కడ చేజారిపోతుందో అన్నంత అపురూపంగా తల్లిదండ్రుల సేవలో తరించాలి.

తల్లిదండ్రులవైపు ప్రేమతో, కరుణతో చూసే ఒక చూపు

తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన, వారి స్థానం, వారి గౌరవాన్ని కాపాడడం, వారిముందు దురుసుగా, ఛీదరింపుగా మాట్లాడకపోవడం, వారి భావోద్రేకాలను అర్థం చేసుకోవడం, వాటిని గౌరవించడం ఇవన్నీ తిరుగులేని దైవాదేశాలు. అందుకే దీని ప్రతిఫలం స్వర్గమని స్పష్టం చేశాడు దైవం. అంతేకాకుండా తల్లిదండ్రుల పట్ల ప్రేమ, కరుణ వారి గౌరవా దరణలు, వారి సేవ ఇవన్నీ సంతానం యొక్క సహజసిద్ధ బాధ్యతలు. వీటిని నెరవేర్చడం వారి నైజంలోనే ఉన్న సహజ స్వభావం. అందుకే వారి సేవలోనే పిల్లల ఆత్మసంతృప్తి ఉంటుంది. ప్రదర్శనాబుద్ధితో, మొక్కు బడిగా బాధ్యతలు నెరవేరుస్తున్నామనిపించుకోడానికి చేసేసేవలు ఎలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చకపోగా తల్లిదండ్రుల హక్కులను నెరవేర్చనందుకు శిక్షను కూడా అనుభవించవలసి ఉంటుంది. భౌతిక ప్రయోజనాలు, వారసత్వంపై కూడా ఆశలు ఉంచుకోకూడదు. ఈ వాస్తవాన్నే దైవప్రవక్త(స) ఎంతో చక్కగా వివరించారు.

హజ్రత్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు:

"ఎవరైనా సత్సంతానం తమ తల్లిదండ్రుల వైపు ప్రేమతో, కారుణ్యంతో చూసినట్లయితే ప్రతిఫలంగా అల్లాహ్ వారికి ఒక స్వీకార యోగ్యమైన, పరిశుద్ధమైన హజ్ పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు." (ముస్లిం)

అప్పుడు, "దైవప్రవక్తా! ఎవరైనా ఒక రోజులో వందసార్లు అలా ప్రేమతో, కారుణ్యంతో చూస్తేనో?" అని ప్రజలు ప్రవక్తను ప్రశ్నించారు.

అప్పుడాయన(స), "అవును, ఒకవేళ రోజుకు వందసార్లు కరుణతో, ప్రేమతో చూసినప్పటికీ అంతటి పుణ్యఫలం లభిస్తుంది. అల్లాహ్ మీ ఊహలకు చాలా ఉన్నతుడు, పరమ పవిత్రుడూను" అని సెలవిచ్చారు.

మానవుడు తన పరిమిత ఊహల మేరకే ఆలోచిస్తాడు. రోజుకు వందసార్లు కారుణ్యంతో, ప్రేమతో చూస్తే వంద హజ్‌ల పుణ్యం ప్రసాదించ బడుతుందన్న విషయం అతని బుద్ధికందదు. అందుకే, అల్లాహ్ అనుగ్రహాలు అనంతమని దైవప్రవక్త(స) తెలిపారు. ఆయన లెక్కలేనంతగా ప్రసాదిస్తాడు. 'ఇంత'కు 'ఇంత'న్న లెక్క ఆయన వద్దలేదు. ఎంతైనా ఇస్తాడు, ఎన్నిసార్లయినా ఇస్తాడు. మీ అనుమానానికి ఆయన అతీతుడు, అతి పవిత్రుడు. మీరు మీలాంటి మానవులతో ఆయన్ను బేరీజు వేయకండి. మీరు ఆయన్ను గురించి ఏ మేరకు ఊహిస్తున్నారో ఆయన అంతకంటే గొప్పవాడు.

ఆర్థిక సహాయానికి మొదటి హక్కుదారులు తల్లిదండ్రులే

వృద్ధాప్యంలో రకరకాల వ్యాధులు, బలహీనతలు వారిని చుట్టు ముడతాయి. తల్లిదండ్రులు వ్యాధిగ్రస్తులైనప్పుడు వారికి శారీరక సేవలూ

చేయాల్సి ఉంటుంది. మందులు మాకులూ తినిపించాల్సి ఉంటుంది. వారి వైద్యసేవల ఖర్చు భరించాల్సి ఉంటుంది. అదృష్టవంతులైన సంతానం బాధ్యత ఏమిటంటే, శారీరక సేవలు చేసే అవకాశం వస్తే దాన్ని తమ అదృష్టంగా భావించి సంతోషంగా తల్లిదండ్రుల సేవచేయాలి. ఒకవేళ వారి కోసం ధన వ్యయం చేయాల్సి వచ్చినా అది కూడా తమ అదృష్టమనే భావిస్తూ, సంతోషంగా వారికోసం ధనం ఖర్చుబెట్టాలి. పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"యస్‌అలూనక మాజా యున్‌ఫిఖూన్. ఖుల్ మా అన్ ఫఖ్‌తుం మిన్‌ఖైరి ఫలిల్ వాలిదైన్' **(బఖర: 215)**

"సంపద ఎలా ఖర్చుచేయాలని ప్రజలు నిన్ను అడుగుతున్నారు. వారికిలా చెప్పు! మీరు ఖర్చుచేసే సంపదకు మొట్టమొదటి హక్కుదారులు మీ తల్లిదండ్రులు."

ఖుర్‌ఆన్, సున్నత్‌లలో సేవ, విధేయత, సత్ప్రవర్తనల గురించి ఏవిధంగా ఉపదేశించబడిందో సరిగ్గా అదే విధంగా తల్లిదండ్రుల కోసం ఖర్చుపెట్టేటప్పుడు గీసి గీసి, పిసినారితనంగా వ్యవహరించకూడదని కూడా ఆదేశించబడింది. పిల్లల సంపదకు మొట్టమొదటి హక్కుదారులు వారి తల్లిదండ్రులే. వారి అవసరాలు తీర్చకపోవడం, వారి కోసం ఖర్చుపెట్టాల్సి వచ్చినప్పుడు దాచిదాచి ఉంచడం సత్సంతానం చేసేపనికాదు. వారి అవసరాలు అంటే, బత్తెం ఖర్చులూ కావచ్చు, మందు మాకూ ఖర్చూ కావచ్చు.

ఒకసారి దైవప్రవక్త (స)వారి సన్నిధికి ఓ వ్యక్తి వచ్చి, 'మా నాన్న ఎప్పుడు కావాలంటే అప్పుడు నా సొమ్ము తీసేసుకుంటున్నాడు' అని ఫిర్యాదు చేశాడు. అప్పుడు దైవప్రవక్త(స) అసలు విషయం ఏమిటో

తెలుసుకోడానికి అతడి వృద్ధ తండ్రిని పిలిపించారు. ఆ బలహీన వృద్ధుడు కర్రపోటుతో దైవప్రవక్త వారి సమక్షంలో హాజరయ్యాడు. దైవప్రవక్త వారు ఆ వృద్ధుణ్ణి అసలు విషయం ఏమిటని ప్రశ్నించినప్పుడు ఆ వృద్ధుడు తన వృత్తాంతం ఇలా వివరించాడు:

"దైవప్రవక్తా! ఒక దశలో నేను బలవంతుణ్ణి, ధనవంతుణ్ణి, యవ్వనంలో ఉన్నాను. ఈ మా అబ్బాయి అప్పుడు నిస్సహాయుడు, బలహీనుడు. దైవం నాకు సిరిసంపదలూ ప్రసాదించాడు. రిక్తహస్తాలతో ఉన్న మావాడు ఎప్పుడు ఏ వస్తువు తీసుకున్నా నేను కాదనలేదు. పరమ సంతోషంగా నా సంపదనంతా అతని కోసం ధారపోశాను. ఈనాడు నేను బలహీనుణ్ణి, అగత్యపరుణ్ణి. ఇతడు యవ్వనంలో ఉన్నాడు, ఆరోగ్యంగా ఉన్నాడు, ఇతని దగ్గర ధనమూ ఉంది. నేను రిక్తహస్తాలతో ఉన్నాను. నేను పైసాపైసాకు దేబిరిస్తుంటే, ఇతడు తన సంపదను దాచి దాచి ఉంచు కుంటున్నాడు" అని వాపోయాడు.

ఈ వృత్తాంతమంతా విని దైవప్రవక్త(స) వలవలా ఏడ్చేశారు. **అంత వమాలకలబ్రైక్**. 'నువ్వూ, నీ సంపద అంతా నీ తండ్రిదే' **అంత వమాలకలబ్రైక్**. 'నువ్వు, నీ సంపద అంతా నీ తండ్రిదే. అని సెలవిచ్చారు.

ఇదేవిధంగా ఒకవేళ తల్లిదండ్రులు రుణగ్రస్తులైతే సంతానం వారి రుణం తీర్చడానికి ప్రయత్నించాలి. తమ సంపదను కేవలం తమ సుఖసంతోషాల కోసమే ఖర్చుపెట్టుకుంటూ, తల్లిదండ్రులను రుణ గ్రస్తులుగా వదిలివేయడం సద్వర్తనులు, ధార్మికులైన సంతానానికి ఎంతమాత్రం శోభించదు. పిల్లల సంపదకు మొట్టమొదటి హక్కుదారులు వారి తల్లిదండ్రులే. కనుక వారి రుణం తీర్చే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించడానికి వీల్లేదు. ఎందుకంటే దైవప్రవక్త(స) రుణగ్రస్తుడి జనాజా

నమాజు చేయించేవారు కాదు. రేపు హష్ర్ మైదానంలో 'రుణం' కారణంగా వారి తల్లిదండ్రులు పట్టుబడడాన్ని సద్వర్తనులైన సంతానం సహించ గలుగుతుందా?

హజ్రత్ అబ్దుల్లా (రజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్(రజి) తండ్రి హజ్రత్ జుబైర్(రజి) గొప్ప ధనవంతులు. ఒక ధనవంతుడు మరణించినప్పుడు, అతను విడిచివెళ్ళిన ఆస్తిపాస్తుల పంపకం త్వరగా జరగాలని, అవి త్వరగా తమ అధీనంలోకి వచ్చేయాలని వారసులు భావిస్తారు. కాని హజ్రత్ అబ్దుల్లా(రజి) ఆలోచన దీనికి పూర్తి భిన్నంగా ఉంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్(రజి), తండ్రి మరణానంతరం ముందుగా ఆయన అప్పులు తీర్చేశారు. తరువాత వారసులందరినీ సమావేశపరిచి, అల్లాహ్ మనందరికీ మన అవసరాలకంటే ఎక్కువే ఇచ్చాడు. మరి మనం ఓ నాలుగేళ్ళ వరకూ ఈ వారసత్వ సంపదను పంచుకోకుండా ఉంటే నష్టమేమిటి? నేను ప్రతి ఏడూ హజ్ సందర్భంలో ఈ విషయం ప్రకటిస్తూ ఉంటాను. ఒకవేళ ఎవరైనా 'నీ తండ్రి నాకు బాకీ వున్నారు' అని ముందుకొస్తే అతని అప్పును తీర్చేసి తరువాతనే మనం పంచుకుందాం అని చెప్పారు. దీనికి వారుసులంతా సమ్మతించారు.

హజ్రత్ అబ్దుల్లా(రజి) ప్రతి ఏడూ ప్రకటిస్తూనే ఉన్నారు. నా తండ్రి హజ్రత్ జుబైర్(రజి) ఎవరికైనా బాకీ ఉన్నట్లయితే వారు నా దగ్గర ఆ బాకీని వసూలు చేసుకోవచ్చు అని. నాకు బాకీ ఉందని ఎవరూ ముందుకైతే రాలేదుకానీ, ఈ పేరుతో హజ్రత్ అబ్దుల్లా(రజి) వేలాదిమందికి తన తండ్రిని గుర్తుచేస్తూ, వారితో తండ్రికోసం ప్రార్థనలు (దుఆ) చేయిస్తూ పొయ్యారు.

తల్లిదండ్రుల అవిధేయత మహాపాపం

అల్లాహ్ తరువాత అందరికంటే గొప్ప ఉపకారం తల్లిదండ్రులదే. వారి ద్వారానే అల్లాహ్ సంతానానికి జీవితం ప్రసాదించాడు. వారి చల్లని చూపులు, వారి కారుణ్యఛాయలోనే సంతానం వృద్ధి చెందింది. వారి కారణంగానే జీవితంలో నవ వసంతం వెల్లివిరిసింది. వారు తమ ఉనికిని, తమ సుఖసంతోషాలను ఏమాత్రం లెక్కచేయక సంతానాన్ని సాకారు. వారికోసం తమ సమస్తాన్నీ త్యాగం చేశారు. హృదయాంతరాళాల్లోంచి వారికి కృతజ్ఞతలు తెలుపుకోవడంలోనే సంతానం యొక్క విజ్ఞత, సద్వర్తన, మానవత్వం, మంచితనం ఆధారపడి ఉన్నాయి. వారికోసం తమ సుఖ సంతోషాలను త్యాగం చేయడం, తమ అవసరాలపై వారి అవసరాలకు ప్రాధాన్యతనివ్వడం, వారి విధేయతలో ఏలోటూ రానివ్వకపోవడం, వారి ఉపకారానికి కృతజ్ఞులై ఉండడం, కనీసం వారికి వ్యతిరేకంగా మనసులో ఊహలు కూడా రానివ్వకపోవడం ఇవన్నీ సత్సంతానం యొక్క లక్షణాలు. ఈ రోజుల్లో సంతానం తమ తల్లిదండ్రుల విషయంలో చాలా ఏమరుపాటు వహిస్తున్నారు. వారిని దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది చాలా తప్పు. కనీసం అలాంటి ఊహకూడా మనసులో రావడానికి వీల్లేదు. దైవప్రవక్త వారి ఈ హెచ్చరికను అవలోకించండి:

హజ్రత్ అబూబకర్(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

"నేను మీకు అతినీచమైన మూడు పాపాలను గురించి తెలుపనా?" అప్పుడు మేమంతా, 'దైవప్రవక్తా! తప్పకుండా తెలపండి' అన్నాము.

"అల్లాహ్‌తోపాటు ఇతరుల్ని ఆరాధించడం, తల్లిదండ్రులకు విధేయత చూపకపోవడం" అని అంటూ అప్పటివరకూ ఆనుకొని కూర్చున్న

ఆయన(స) అకస్మాత్తుగా లేచికూర్చుని, బాగా వినండి, 'అసత్యం పలకడం, అబద్ధపు సాక్ష్యం చెప్పడం' అని సెలవిచ్చారు. ఆయన ఈ విషయాన్ని మాటిమాటికీ అలా చెబుతూనే పొయ్యారు. చివరికి మేమంతా 'అయ్యో, దైవప్రవక్త ఇలా చెప్పకుండా మౌనంగా ఉంటే బాగుండును' అనుకున్నాం.

(బుఖారి, ముస్లిం, తిర్మిజీ)

ఈ హదీసులో **'ఉఖూఖుల్ వాలిదైన్'** అన్న పదం ఉపయోగించబడింది. ఇది చాలా విస్తృతార్థం కల పదం. ఖురాన్ హదీసుల్లో తల్లి దండ్రుల పట్ల సత్ప్రవర్తనకు సంబంధించి, సద్వర్తనులైన సంతానానికి ఎలాంటి హితవులు, ఉపదేశాలు చేయబడ్డాయో వాటికి వ్యతిరేకంగా చేయడాన్నే 'ఉఖూఖ్' అంటారు. తల్లిదండ్రుల్ని పట్టించుకోకపోవడం, వారిని నిర్లక్ష్యం చేయడం, వారితో తీక్షణంగా మాట్లాడడం, అహంకారంతో ప్రవర్తించి వారి మనోభావాలను గాయపరచడం, వారి అవసరాలను గుర్తించకపోవడం, వారి అశక్తతకు జాలిపడకపోవడం, వారిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం, వారిపట్ల వినయ విధేయతల వైఖరికి బదులు కఠినంగా, క్రూరంగా ప్రవర్తించడం, వారి కోరికలను, వారి ఆదేశాలను నీచంగా చూడడం, వారిని వేధించడం, అవమానించడం, వారికి శాపనార్థాలు పెట్టడం. ఇవన్నీ 'ఉఖూఖె వాలిదైన్' అర్థంలో ఇమిడి ఉన్నాయి. దైవప్రవక్త(స) అనేక సందర్భాల్లో ఈ అవిధేయతకు సంబంధించిన సకల దుర్గుణాలకు దూరంగా ఉండాలని నయానా, భయానా ఉద్బోధించారు. తల్లిదండ్రుల అవిధేయతను అల్లాహ్ ప్రవక్త(స) మహాపాపంగా అభివర్ణించారు. ఈ మహాపాపానికి సంబంధించి హృదయం కంపించిపోయే ఒక విషయాన్ని కూడా ఆయన తెలిపారు.

తల్లిదండ్రుల అవిధేయతకు ఇహలోకంలోనే శిక్ష పడుతుంది

దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారని హజ్రత్ అబూబకర్ నఫీ బిన్ హారిస్ ఉల్లేఖించారు:

“మొత్తం పాపాల్లో కొన్నింటి శిక్షను అల్లాహ్ తాను కోరితే ప్రళయం నాటి వరకు వాయిదా వేస్తాడు. కాని ‘ఉఖూఖుల్ వాలిదైన్’ అంటే తల్లి దండ్రులను పట్టించుకోకుండా అవిధేయత చూపేవారిని మాత్రం మరణానికి ముందే ఈ జీవితంలోనే వారికి శిక్ష విధిస్తాడు” (హాకిం)

ప్రవక్త కాలంనాటి ఓ కన్నీటిగాథ

ముస్నదె అహ్మద్, తిబ్రానీ గ్రంథాల్లో ముహమ్మద్ ప్రవక్త కాలంనాటి ఉపదేశాత్మక గాథ ఒకటుంది. అందరికీ ఇందులో గుణపాఠం ఉంది. “ఒకసారి సహచరులంతా ప్రవక్తవారి సన్నిధిలో కూర్చొని ఉండగా ఒక వ్యక్తి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు. దైవప్రవక్తా! ఓ యువకుడు చివరి ఘడియల్లో ఉన్నాడు. ప్రజలు అతణ్ణి ‘కలిమా’ చదవమని గుర్తు చేస్తు న్నారు. కాని అతని నోటినుండి ‘కలిమా’ వచనాలు వెలువడడం లేదు” అన్నాడు.

దైవప్రవక్త(స) ఆ వచ్చిన వ్యక్తిని, ‘ఇతను నమాజు చేసేవాడా?’ అని ప్రశ్నించారు.

“అవును దైవప్రవక్తా! అతను నమాజు చదివేవాడు” అన్నాడా వ్యక్తి.

ఈ మాట విని దైవప్రవక్త అతని వెంట వెళ్ళారు. సహచరులు కూడా ఆయన్ను అనుసరించారు. దైవప్రవక్త నేరుగా ఆ యువకుని దగ్గరికి

వెళ్ళారు. ఆ యువకుడికి అవి చివరి ఘడియలు. ఆయన కూడా 'కలిమా' చదవమని అతడికి ఉపదేశించారు. అప్పుడా యువకుడు "దైవప్రవక్తా! నా నోటి నుండి 'కలిమా' రావడంలేదు." అని చెప్పాడు. 'కారణమేమిటి?' అని దైవప్రవక్త విచారించారు. అప్పుడు ప్రజలు 'ఇతడు తన జీవితంలో తల్లిదండ్రులకు విధేయత చూపేవాడుకాదు' అని చెప్పారు.

'ఈ యువకుని తల్లి జీవించేఉందా?' అని దైవప్రవక్త అక్కడి ప్రజలను అడిగారు.

"అవును, ఇతని తల్లి జీవించే ఉంది. కాని ఇతనితో కాకుండా వేరుగా ఉంటోంది" అని చెప్పారు ప్రజలు.

"ఆమెను పిలుచుకురండి.' అని ఆదేశించారు దైవప్రవక్త.

ఆమె వచ్చిన తరువాత, దైవప్రవక్త(స) ఆమెనుద్దేశించి, 'అమ్మా! ఇతను నీ కొడుకేనా?' అని ప్రశ్నించారు.

"అవును దైవప్రవక్తా! వాడు నా కొడుకే. కాని వాడు నాకు అవిధేయుడు. నేను వాడి ముఖం కూడా చూడను" అన్నదామె.

అప్పుడు దైవప్రవక్త(స) ఆ ముసలి తల్లితో, 'అమ్మా! ఒక భయంకరమైన అగ్నిగుండం రాజేసి, అందులో నీ కొడుకు పడదోయడానికి నిర్ణయం జరిగినప్పుడు, నీ కొడుకు ఈ అగ్నిగుండం నుండి రక్షించబడాలంటే, కేవలం నీ సిఫారసు మాత్రమే ఇతణ్ణి రక్షించ గలుగుతుందని చెబితే, నువ్వు నీ కొడుకును ఆ అగ్నికీలలకు ఆహుతి చేస్తావా? లేక అతని కోసం సిఫారసు చేస్తావా?' అని ప్రశ్నించారు.

అప్పుడా ముసలి తల్లి, 'అలాంటి సందర్భంలో నేను నా కొడుకు సిఫారసునే చేస్తాను. ఆ భయానక అగ్నికీలల నుండి వాణ్ణి రక్షించుకుంటాను' అన్నదామె.

ఈ మాటవిని దైవప్రవక్త(స) 'అయితే నువ్వు, నన్నూ దైవాన్నీ సాక్ష్యంగాపెట్టి, "నా కొడుకును క్షమించాను" అని చెప్పు అన్నారు.

అప్పుడా ముసలితల్లి, అల్లాహ్! నేను నీ సాక్షిగా, నీ ప్రవక్త సాక్షిగా 'నా కొడుకును క్షమించాను' అన్నది.

అప్పుడు దైవప్రవక్త(స) అంతిమ ఘడియల్లో తీవ్రమైన మరణ యాతన అనుభవిస్తున్న ఆ యువకుణ్ణి సంబోధించి, 'ఇప్పుడు కలిమా చదువు' అన్నారు. వెంటనే ఆ యువకుని నోట 'కలిమా' వచనాలు ధారాళంగా జాలువారాయి. ఈ విశ్వాసశక్తి దృశ్యాన్ని చూసి దైవప్రవక్త నోట కృతజ్ఞతా స్తోత్రాలు వెలువడ్డాయి:

"అల్లాహ్ నీకు కృతజ్ఞతలు. నా మాధ్యమంగా నువ్వు ఈ యువకునికి నరకజ్వాలలనుండి విముక్తి కల్పించావు" అన్నారాయన (స).

పవిత్ర ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాల్లో వివరించబడిన తల్లిదండ్రుల హక్కులను ఉత్తమ రీతిలో నెరవేర్చడమే సంతానం బాధ్యత. వీటిని వారు హృదయపూర్వకంగా, సంతోషంగా, గౌరవం మరియు త్యాగభావాలతో ఉత్సాహంగా నెరవేర్చాలి. సద్వర్తనులైన సంతానం ఇలాంటి ఉత్తమ రీతిలోనే తమ తల్లిదండ్రుల హక్కులను నెరవేరుస్తారు. మొక్కుబడిగా లేక పేరుప్రఖ్యాతుల కోసమో లేక ఇరుగుపొరుగు ఏమనుకుంటారోనని వారి సేవలు చేయడం తగదు. వారిని ప్రాణప్రదంగా చూసుకుంటూ, హృదయపూర్వకంగా వారి సేవలు చేస్తూ కూడా ఇంకా వారి హక్కులు నెరవేర్చ లేకపోతున్నామనే భావించాలి.

సంతానం హక్కులు- తల్లిదండ్రుల బాధ్యతలు

పైన మేము తల్లిదండ్రుల హక్కులకు సంబంధించి కొన్ని విషయాలు సంక్షిప్తంగా వివరించాము. ఈ తల్లిదండ్రుల హక్కులను సంతానం

బాధ్యతలుగా కూడా మనం చెప్పుకోవచ్చు. ఇప్పుడు చాలా సంక్షిప్తంగా సంతానం హక్కులను గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాము. దీన్నే తల్లిదండ్రుల బాధ్యతలు అని కూడా చెప్పుకోవచ్చు.

కౌటుంబిక వ్యవస్థ పటిష్టంగా, ఫలవంతంగా ఉండాలంటే, హక్కులు, బాధ్యతల్లో సమన్వయం, సంతులనం ఉండి తీరాలి. కుటుంబ సభ్యులు తమ హక్కుల విషయంలో చూపు వహిస్తూ, బాధ్యతలు నిర్విర్తించడంలో ముందు వరుసలో ఉన్నట్లయితే, వారు అల్లాహ్ దృష్టిలో ప్రీతిపాత్రులు కావడమేగాక, హక్కులు బాధ్యతలకు సంబంధించి ఆదర్శంగా, నమూనాగా నిలబడవచ్చు. విశ్వాసుల కుటుంబాల్లో సంపూర్ణ సుఖసంతోషాలు, పరస్పర సంబంధాల్లో పటిష్టత, ఐక్యత సాధ్యమవుతుంది. హక్కులు బాధ్యతల్లో సమన్వయంలేని కారణంగానే అవినీతి, లంచగొండితనం, అవిధేయత, బాధ్యతారాహిత్యం లాంటి దుర్లక్షణాలు జనిస్తున్నాయి. ప్రతి ఒక్కడూ తన హక్కులను సాధించుకోడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తుంటాడు. ఎన్నో పథకాలు రచిస్తుంటాడు. ఏం చేసైనా తన హక్కులను సాధించుకోవడం అతనికి కావలసింది. కాని, తన బాధ్యతల నిర్వహణలో మాత్రం ఘోరమైన నిర్లక్ష్యం వహిస్తాడు. తన బాధ్యతలు ఏమిటన్న స్పృహ కూడా అతనికి లేనంతగా అలక్ష్యం వహిస్తాడు.

తల్లిదండ్రులతో రెండు మాటలు

కొన్ని అదృష్టవంతుల కుటుంబాలు తప్ప, ఈనాడు ప్రతి కుటుంబంలో 'సంతానం మాట వినడం లేద'న్న ఏడుపే వినబడుతోంది. సంతానం పట్ల ఫిర్యాదు ఈనాడు సర్వసాధారణమైపోయింది. కొడుకులే కాదు కూతుళ్ళు కూడా తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని గుర్తించడంలేదు.

తల్లిదండ్రులను గౌరవించడం, వారికి విధేయత చూపాలన్న భావనే మనసుల్లో నుండి తుడిచిపెట్టుకుపోయింది.

తల్లిదండ్రుల సేవ, విధేయత, వారిపట్ల గౌరవమర్యాదలు, తాము వారి కన్నబిడ్డలమన్న భావోద్రేకాలతో వారి అవసరాలను గుర్తించడం, వారి బలహీనత, వారి అశక్తతలో వారిని ఆదుకోవాలన్న విషయం ఇవన్నీ అర్థంలేని మాటలుగా లేక అర్థం చేసుకునే అవసరం లేని విషయాలుగా మారిపొయ్యాయా అనిపిస్తోంది. ఈనాడు శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రపంచం అసాధారణ ప్రగతి సాధించింది. సమాచార విప్లవం పూర్తి ప్రపంచాన్నే ఒక కుగ్రామంగా మార్చివేసింది. ప్రతి విషయాన్నీ తమ గ్రామం, తమ పట్టణం, తమ దేశపరిధుల్లో ఆలోచించడం మాని, అంతర్జాతీయ పరిధిలో ఆలోచించే పోకడ సర్వసాధారణమైపోయింది. ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకూడా కొత్తతరం తలబిరుసుతనం, అవిధేయత, విద్రోహ వైఖరినవలంబిస్తోందన్న ఫిర్యాదులు కూడా సర్వసామాన్య మయ్యాయి. ఎక్కడికి వెళ్ళినా, ఏ సమావేశంలో కూర్చున్నా, ఏ పత్రిక తిరగేసినా, ఏ ఛానెల్ పెట్టినా కొత్తతరంలో మానవ విలువలు నాశనమై పోతున్నాయన్న వార్తలే ప్రముఖంగా కనబడుతుంటాయి.

ఇలాంటి పరిస్థితిలో తల్లిదండ్రులు ఒక విషయాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. పరిస్థితులు ఈవిధంగా తీవ్రరూపం దాల్చడానికి, వాతావరణంలో ఇలాంటి అనైతికత ప్రబలడానికి వారి పాత్ర కూడా ఏమైనా ఉందా? సంతానం చదువుసంధ్యలు, వారి శిక్షణ, సంస్కరణలకు సంబంధించి, దైవం తల్లిదండ్రులపై ఏ బాధ్యతలైతే మోపాడో వాటి నిర్వహణలో ఎక్కడైనా లోపం జరుగుతోందా? పిల్లల భవిష్యత్తుకు సంబంధించి మీ కోరికల్లో ఏమన్నా వైరుధ్య భావాలు కాని ఉన్నాయా?

మరో విషయం ఏమిటంటే, మీ పిల్లలు మీ హక్కులు నెరవేర్చాలంటే, మీ ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకునేవారుగా రూపొందాలంటే, మీరు కూడా మీ బాధ్యతలను హృదయపూర్వకంగా నిర్వర్తించాలి. వారికి సంబంధించి అల్లాహ్ మీపై ఏ బాధ్యతలైతే మోపాడో, వాటిని చిత్తశుద్ధితో నెరవేర్చాలి. పిల్లల తలబిరుసుతనం, అవిధేయత, వారి దుర్నడత నిస్సందేహంగా తల్లిదండ్రులను బాధిస్తుంది. కాని వారి పెంపకంలో, వారి శిక్షణలో తల్లిదండ్రులు ఏమేరకు తమ బాధ్యతలు నెరవేర్చారో కూడా ఆలోచించాల్సిన విషయమే. తమ రేయింబవళ్ళ ప్రవర్తన ద్వారా వారిని మంచివారుగా, విధేయులుగా, సౌశీల్యవంతులుగా మలచడానికి ఏమేరకు ప్రయత్నం జరిగిందో కూడా యోచించాల్సిన అవసరముంది.

తల్లిదండ్రుల స్థానమేమిటి? వారి విధేయత, వారి సేవలో ఎలా తరించాలి. అసలు వారి ఔన్నత్యం ఏమిటి? అన్న విషయాలే సంతానానికి బోధించకపోతే, వారు తల్లిదండ్రుల హక్కులను ఎలా తెలుసుకో గలుగుతారు. మీరు వారి భావాలను, ఆలోచనలను గౌరవించక, వారిని మన స్ఫూర్తిగా ప్రేమించక, ప్రేమ నిండిన గుండెలతో వారిని హృదయానికి హత్తుకొనే తీరికే మీకు లేకపోతే, వారిని నిర్లక్ష్యం చేసి, మిమ్మల్ని మీరు ఉన్నతస్థానాలకు చేర్చుకోడానికి మీ సమయాన్నంతా వెచ్చించినట్లయితే, వారు మిమ్మల్ని ఆధారంగా ఎలా చూడగలరు? మీ బలహీనతలు, మీ అశక్తతలను వారెందుకు గౌరవిస్తారు? మీరు మీ శిక్షణ ద్వారా వారిని ఎలా మలిచారో, అదేవారినుండి ఆశించండి. అన్నిరంగాల్లో పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు వారి హక్కులను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఆ హక్కుల్ని నెరవేర్చడం

కోసం శక్తివంచన లేని ప్రయత్నం, వివిధ రకాల త్యాగాలు కూడా అవసర మవుతాయి. వారి హక్కుల్ని సక్రమంగా నెరవేర్చి మాత్రమే, మీరు వారి హక్కులేమిటో, బాధ్యతలేమిటో స్పష్టంగా తెలియజేయ గలుగుతారు. అవేమిటో సంక్షిప్తంగా చర్చిద్దాం.

పిల్లలను గౌరవించడం

పిల్లల మొట్టమొదటి హక్కు ఏమిటంటే, మీరు వారిని గౌర వించాలి. వారిని అల్లాహ్ అనుగ్రహమని, అత్యున్నత కానుక అని భావించాలి. పిల్లలు ఇంటికి అందం, జీవితానికి తోడు, తల్లిదండ్రుల కలల సాకారం. సంతానం మీ కోరికలను, మీ మనోకాంక్షలను నెరవేరుస్తుంది. మీకు ఇష్టమైన అలవాట్లను, సిద్ధాంతాలను, నాగరికతలను, ఆచార వ్యవహారాలను సంరక్షించి, వాటిని ప్రచారం చేస్తుంది. మీ ప్రాణంలో ప్రాణంగా మీ చరిత్రను కాపాడుతుంది.

ఇస్లామీయ కుటుంబాల్లో, 'సంతానం తమ వంశ గౌరవాన్ని కాపాడాలని, తమవంశం పేరు నిలబెట్టాలని, తమ భౌతిక సంపదకు వారసులు కావాలని' మాత్రమే కోరడం జరగదు. సంతానం కావాలని కోరుకోవడానికి అసలు కారణం, హజ్రత్ జక్రియా(అలై) మాటల్లో చెప్పాలటే, 'ధార్మిక వారసత్వం సంరక్షింపబడాలి. ధర్మం సంరక్షింపబడాలి. మన ఆచార వ్యవహారాలు సంరక్షించబడాలి. మా తరువాత మా సంతానం మా ధార్మిక నాగరికతను, వారసత్వాన్ని సంరక్షిస్తుందన్న సంతృప్తితో మనమీ ప్రపంచం నుండి వీడ్కోలు తీసుకోవాలి.

ఫహబ్‌లీ మిల్లదున్‌క వలియ్యా. యరిసునీ వయరిసు మిన్

ఆలి యఅఖూబ వజ్అల్ హు రబ్బి రజియ్యా.

"ప్రభూ! నాకు వారుసుణ్ణి ప్రసాదించు. అతడు నాకూ వారసుడు కావాలి. యాఖూబ్ సంతతి వారసత్వాన్నీ పొందాలి. ప్రభూ! అతణ్ణి అందరికీ ఇష్టమైన వ్యక్తిగా తీర్చిదిద్దు." (మర్యం: 5,6)

పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ వాక్యంలో హజ్రత్ జక్రియా(అలై) నాకు నీ తరఫున వారసత్వాన్ని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకున్నారు. అంటే, బాహ్యంలో చూస్తే ఆయనకు సంతానం కలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే ఆయన భార్య గొడ్రాలు. ఆయనేమో పండు ముదుసలి. అందుకే ఆయన నా వెంట్రుకలు తెల్లబడినా, నా భార్య గొడ్రాలైనా నువ్వు నాకు సంతానం ప్రసాదించగల సమర్థుడవు. ఆ శక్తి నీకు ఉంది. సంతానానికి కావలసిన బాహ్యకారణాలు నాలో లేకపోయినా నాకు ప్రసాదించు. ఈ ప్రాపంచిక సంపదకు వారసుడు కావాలన్న ఉద్దేశ్యంతో నేను వారసుణ్ణి కోరడంలేదు. ప్రభూ! నువ్వు నాకు ఏ గౌరవస్థానాన్నైతే ప్రసాదించావో, ఆ గౌరవోన్నతి బాధ్యతలు నెరవేర్చడానికి, దాని ప్రచారం, ప్రచురణల వారసత్వాన్ని, యాఖూబ్, యాఖూబ్ సంతతి ధార్మిక వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి అని వేడుకున్నారు.

ప్రార్థన చివరిలో, 'పరాత్పరా! అతణ్ణి అందరికీ ఇష్టమైన వాడిగా, అందరికీ ఆమోదయోగ్యుడిగా చెయ్యి' అనికూడా అర్థించారు.

విశ్వాసులు, దైవభీతిపరులైన తల్లిదండ్రుల ఆలోచనా విధానం ఎలా ఉండాలంటే, సంతానం తమ ధార్మిక సంపదకు వారసులు, దాని వల్లనే దైవం తల్లిదండ్రులను గౌరవించి, కరుణించాడు అన్నవిధంగా ఉండాలి. జక్రియాగారికి తన ప్రాపంచిక సంపదకు వారసులు కావాలన్న ఆలోచనే లేదు. ఎందుకంటే ప్రవక్తలకు ప్రపంచ వారసత్వం ఉండనే ఉండదు. ఆయన చింతన అంతా సత్యధర్మాన్ని గురించి, ధార్మిక

బోధనలను గురించే. ఇస్లామీయ నాగరికత, సంప్రదాయాల గురించే ఆయన బాధంతా. నా తరువాత వీటిని రక్షించడానికి, ప్రచారం చేయడానికి, ఒక ధ్వజవాహకుడు వారసుడుగా లభించాలి అన్నది ఆయన తపన.

మొత్తానికి ఉత్తమ సంతానం కుటుంబ సత్సంప్రదాయాలను కూడా సంరక్షిస్తుంది. ఈ కారణంగా కూడా సంతానాన్ని గౌరవించాలి. కాని అసలు గౌరవానికి పునాది ఏమిటంటే, వారి ద్వారానే తమ బోధనలు, సాంప్రదాయాలు సజీవంగా ఉంటాయి. అందుకే ముస్లిం తల్లిదండ్రులు కేవలం సంతానం కావాలని మాత్రమే ప్రార్థించరు. ఉత్తమ సంతానం కావాలని, సజ్జన సంతానం కావాలని, సచ్ఛీల సంతానం కావాలని ప్రార్థిస్తారు. అందుకే నా వారసుణ్ణి అందరికీ ఇష్టుడిగా, యోగ్యుడిగా చెయ్యమని జక్రియా(అ) ప్రార్థించారు.

సంతానం సదఖ-యె- జారియా

మరణానంతరం కూడా మానవుడి కర్మల పత్రంలో రాయబడే సత్కార్యాల్లో సద్వర్తన సంతానం కూడా ఒకటి. మరణంతోనే మానవుడి ఆచరణలన్నీ ఆగిపోతాయి. కాని, అతడు తన తరువాత సత్సంతానాన్ని వదిలి వెళ్ళినట్లయితే, ఆ సంతానం అతడి పట్ల 'సదఖ-యె- జారియ' (ఎల్లప్పుడూ లభించే పుణ్యం)గా పరిణమిస్తుంది. హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

"మరణంతోనే మానవుడి కర్మల పరంపర అంతమైపోతుంది. కాని మూడు విషయాలు మాత్రం అలాకాదు. 1. మనిషి తన మరణానంతరం కూడా ఆగిపోని 'సదఖ' (దానం)ను వదిలివెళితే. 2) తన తరువాత కూడా ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విద్య. 3) తన మరణం తరువాత తన కోసం ప్రార్థించే సత్సంతానం." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా(రజి)గారి మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది. "మయ్యత్ (శవం) అంతస్తులు పెరిగినప్పుడు, 'ఏమిటి నా స్థాయి ఇంతగా పెరిగిపోయింది? అని ఆ శవం ఆశ్చర్యంగా ప్రశ్నిస్తుంది. అప్పుడు అల్లాహ్ తరపున, 'నీ సంతానం నీ క్షమాపణ కోసం దుఆ చేస్తూ ఉండేది. అందుకని నీ అంతస్థు అలా పెరిగిందని చెప్పబడుతుంది." (అల్లాహ్ ఆ దుఆను స్వీకరించాడు)

హజ్రత్ ఉమ్మె హబీబా(ర.అన్హా) కథనం: నేను హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు దైవప్రవక్త(స) అక్కడికి వచ్చారు. తరువాత ఇలా సెలవిచ్చారు.

ఒక ముస్లిం జంటకు చెందిన ప్రాజ్ఞతకు రాని ముగ్గురు పిల్లలు మరణిస్తే, వారు ప్రళయదినాన స్వర్గద్వారానికి అడ్డంగా నిలబడి ఉంటారు. అప్పడువారిని, మీరెక్కడున్నాసరే, వెళ్ళండి స్వర్గంలో ప్రవేశించండి అని అన్నప్పుడు ఆ చిన్నారులు, 'మా తల్లిదండ్రులు స్వర్గంలో ప్రవేశించ నంతవరకు మేమూ స్వర్గంలోకి ప్రవేశించలేము అని సమాధానం పలుకు తారు. అప్పుడు అల్లాహ్, 'వెళ్ళండి, మీరు మీ తల్లిదండ్రులతో సహా స్వర్గంలోకి వెళ్ళండి' అని ఆదేశిస్తాడు.

పిల్లల పట్ల గౌరవం, వారిని దేవుని గొప్ప వరంగా, ప్రాపంచిక జీవితంలో తోడుగా, పరలోక జీవన సామగ్రిగా భావించడం కేవలం అబ్బాయిల విషయంలోనే అనుకుంటే పొరపాటే. అమ్మాయిలైనా ముస్లిం తల్లిదండ్రుల ఆలోచనా విధానం ఇలాగే ఉంటుంది, ఉండాలి కూడా.

ఆడపిల్లకూడా అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహమే

ఆడపిల్ల పుట్టుకపట్ల చింతించడం, ఆమెను భారంగా, అవ మానంగా తలచడం కాఫిర్ల (దైవతిరస్కారుల) వైఖరి. ఇది చాలా నీచమైన

ఆలోచన. పవిత్ర ఖుర్‌ఆన్ దీన్ని పరమ దుర్మార్గమైన చర్యగా అభివర్ణించింది. దైవప్రవక్త(స) ఈ ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చివేసి, ఒక విప్లవాత్మక చర్యగా రూపొందించారు. ముస్లిం తల్లిదండ్రులు ఆడపిల్ల పుట్టుకను అభిశాపంగా భావించకూడదని, అలాంటి ఆలోచనకే వారు కంపించిపోవాలని దైవప్రవక్త(స) ఖరాఖండిగా ఆదేశించారు. దైవప్రవక్త(స) కంటే ఉత్తమ మానవుడు ఇంతవరకు జన్మించలేదు, ఇకముందు జన్మించబోడన్న సంపూర్ణ విశ్వాసం మనకుంది. కాబట్టి ఆయన గారి ఆదేశానికి విలువనివ్వడం, ఆయన మాటను శిరోధార్యంగా భావించడం ముస్లింల విధి. ఆయన ఆదేశాలను ధిక్కరించడం, ఆయన మాటకు గౌరవమివ్వకపోవడం, ఒకవేళ గౌరవించినా అందులో పరిపూర్ణత లేకపోవడం 'కుఫ్ర్' అనబడుతుంది. ఆడపిల్ల విషయంలో ఆయన(స) అంత స్పష్టంగా, అంత కరాఖండిగా చెప్పిన తరువాత కూడా ఆడపిల్ల పుట్టుకను అభిశాపంగా భావించి, ఆ శిశువును వదిలించుకోవాలన్న ఆలోచనను ముస్లిం అన్నవాడెవడూ ఊహించనైనా ఊహించలేడు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'లాతక్రహుల్ బనాత ఫానీ అబ్‌వల్ బనాత్'

"ఆడిపిల్లను హీనంగా చూడకండి. ఎందుకంటే నేను కూడా ఆడపిల్లల తండ్రినే."

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"ఆడపిల్లలు ఎంతో ప్రేమాభిమానాలు కలవారై ఉంటారు. వారిలో ఎన్నో శుభాలు, మేళ్ళు ఉంటాయి."

హజ్రత్ ఇబ్నె షరీత (రజి) కథనం: "దైవప్రవక్త(స) సెలవిస్తుండగా నేను విన్నాను. ఎవరి ఇంటనైనా ఆడపిల్ల జన్మిస్తే, అల్లాహ్ ఆ ఇంటికి దైవదూతలను పంపుతాడు. వారు ఆ ఇంటికొచ్చి, 'గృహవాసులారా!

అస్సలాము అలైకుం' అంటూ ఆ శిశువును తమ రెక్కల్లోకి తీసుకుంటారు. శిశువు తల నిమురుతూ, ఇదొక బలహీన ప్రాణి, ఒక బలహీన ప్రాణి నుండే ఇది జన్మించింది. ఎవరైతే ఈ శిశువు పోషణ భాధ్యత చేపడతారో వారికి ప్రళయం వరకు అల్లాహ్ సహాయం తోడుంటుంది" అంటారు.

ఆడపిల్ల పుట్టుక పట్ల పెదవి విరిచేవారు, బాధపడేవారు, ఆమెను సంతోషంగా సాకితే, సక్రమంగా పెంచిపోషిస్తే దైవప్రవక్త ఎంతటి గొప్ప శుభవార్తను అందజేశారో ఆలోచించాలి. ఆడపిల్లను అపురూపంగా పెంచినవారు స్వర్గంలో దైవప్రవక్త(స) వెన్నంటి ఉంటారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రవక్త మహనీయులే తన చేతి రెండు వేళ్ళను కలిపి చూపిస్తూ 'ఇదిగో ఇలా ఉంటాం' అని చెప్పారు. ఇంతకంటే గొప్ప శుభవార్త ప్రతిఫలం ఇంకేమైనా ఉంటుందా? అంతేకాదు, ఆడపిల్లలు తమ తల్లిదండ్రులను నరకాగ్నినుండి రక్షించే రక్షణ కవచాలని కూడా ఆయన శుభవార్తనిచ్చారు.

ఆడపిల్లల హత్య ఘోరమైన రక్తపాతం

సంతానాన్ని అల్లాహ్ అనుగ్రహించిన మహోన్నత కానుకగా భావించే వారు, ఈ అత్యున్నత కానుకను గౌరవించే అదృష్టవంతులు సంతానం హత్యమాట అటుంచి, అలాంటి భయంకరమైన నీచ ఆలోచనలకే కంపించిపోతారు. కాని మానవుడు మానవ ఔన్నత్యపు స్థాయినుండి దిగజారినప్పుడు పశువుకంటే హీనంగా తయారవుతాడు. మానవ సమాజంలో వారు మానవులుగానే భావించబడినా, తమ స్వభావంరీత్యా వారు క్రూర జంతువులవంటివారు. ఇలాంటి స్వభావం కలవారు తమ సంతానాన్ని తమ చేజేతులా హత్యచేస్తారు. కొంతమంది మూర్ఖులైతే తమ ఇష్టదైవాలను సంతోషపరుచుకోవడానికి, మొక్కుబడుల రూపంలో తమ

ప్రియ సంతానాన్ని బలి సమర్పించుకునేవారున్నారు. ఈ దుర్మార్గపు చర్యను వారు సత్కార్యమని భ్రమిస్తారు.

మరికొంతమంది అజ్ఞానులైతే, 'వీరు తమ ఉపాధిలో పాలుపంచుకున్నట్లయితే, తమ సుఖసంతోషాలకు విఘాతం కలుగుతుందని భావించి తమ సంతానాన్ని హత్య చేసేవారు. మరికొందరు ఆడపిల్ల పుట్టుక అవమానకరమని, సిగ్గుచేటని భావించి చంపేవారు. మరికొంతమంది మగ పిల్లవాడితో పోల్చుకుంటే ఆడపిల్లల పెంపకంలో ఖర్చు ఎక్కువవుతుందని, అంతేకాక మగపిల్లవాడైతే లక్షలకు లక్షలు కట్నం తెస్తాడని, ఆడపిల్లకు ఎదురు లక్షలు ఖర్చుపెట్టాల్సి ఉంటుందని కూడా వదిలించుకునే వారున్నారు.

పవిత్ర ఖుర్ఆన్ సంతానం హత్యను తీవ్రమైన నేరంగా, పాపంగా పరిగణించింది. దైవప్రవక్త(స) ఈ భయంకర దుర్మార్గాన్నుండి సమాజాన్ని రక్షించడానికి, పవిత్రం చెయ్యడానికి అత్యంత ప్రాముఖ్యమిచ్చారు. 'ఉఖ్బ' ఒప్పందంలో అన్సారులనుండి తీసుకున్న వాగ్దానాల్లో వారు 'తమ సంతానాన్ని చంపమన్న' ఒప్పందం ప్రముఖమైనది. సంతాన హత్యలు చేయమని, మానవ ప్రాణాలను గౌరవిస్తామని వారితో ఒప్పందం చేసుకోవడం జరిగింది. కఠిన హృదయులు, పాషాణ మనస్కులు, జంతు లక్షణాలు గల నాటి అరబ్బులు మల్లెపువ్వుల్లాంటి తమ ఆడపిల్లలను సజీవంగా పూడ్చిపెట్టేవారు. ఈ కాఠిన్యాన్ని దైవం తీవ్రంగా పరిగణిస్తూ హృదయం కంపించే పదాల్లో ఇలా ప్రశ్నిస్తున్నాడు.

'వ ఇజల్ మవ్ఊదతు సుఇలత్ బి అయ్యిజన్‌బిన్ ఖుతిలత్.'

'సజీవంగా పూడ్చిపెట్టిన అమ్మాయిని, ఏ పాపం కారణంగా నువ్వు హత్య చేయబడ్డావు? అని ప్రశ్నించడం జరుగుతుంది." (తక్వీర్, 8,9)

అనాడేకాదు, ఈనాడు కూడా మన సమాజంలో ఈ దుర్మార్గం ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. సామాజిక ప్రయోజనం కోసమని చెబుతూ, కొత్తకొత్త అకర్షణీయమైన పేర్లతో, పథకాలు ప్రణాళికలతో నిరాటంకంగా, ఏదో ఒక స్థాయిలో హత్య సాగిపోతూనే ఉంది. కాని, ఇస్లాం మానవ ప్రాణానికి ఎంతో గౌరవమిస్తుంది. పవిత్రమైనదిగా భావిస్తుంది. ఒక ప్రాణమైనా, వంద ప్రాణాలైనా ఒకటేనంటుంది. ఒక ప్రాణిని చంపితే మొత్తం మానవులనే చంపినట్లు పరిగణిస్తుంది. కొత్త ప్రాణాలను కుటుంబంలోకి ఆహ్వానించడం శుభకరమని చెబుతుంది. కొత్త ప్రాణాలు మీకోసం శుభసంతోషాల సందేశాన్ని మోసుకొస్తాయని బోధిస్తుంది. సంతానాన్ని అల్లాహ్ ప్రసాదించిన అమూల్య వరమన్న స్పృహను తల్లి దండ్రుల్లో కలిగించి, వారిని గౌరవించే విధంగా వారిని పరలోక సామగ్రిగా భావించమని బోధిస్తుంది.

పిల్లల పెంపకం

సంతానాన్ని గౌరవించడం, వారిని అత్యున్నత వరంగా భావిం చడంతోపాటు తల్లిదండ్రుల బాధ్యత లేక పిల్లల హక్కు ఏమిటంటే వారిని ప్రాణప్రదంగా చూసుకుంటూ వారికి మంచి శిక్షణ ఇవ్వాలి. అన్ని కోణాల్లో వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి శక్తివంచన లేకుండా శ్రమించాలి. పిల్లలు తమ ఉనికికోసం ఏవిధంగా తల్లిదండ్రులపై ఆధారపడ్డారో, సరిగ్గా అదేవిధంగా తమ వృద్ధివికాసాలు, తమ పర్యవేక్షణ, సంరక్షణ కోసం కూడా తల్లిదండ్రులపైన్నే ఆధారపడతారు. వారి బాల్యదశ పూర్తిగా పరాధీనంగా, నిస్సహాయస్థితిలో గడుస్తుంది. ఇలాంటి సున్నిత దశలో వారిని ప్రాణ ప్రదంగా చూసుకునేవారి పర్యవేక్షణ గనక లభించకపోతే వారి పెంపకంలో

ఎన్నో అపశృతులు దొర్లుతాయి. తమ సర్వస్వాన్నీ త్యాగం చేసి, తమ చిన్నారులను ప్రగతి శిఖరాలకు చేర్చాలన్న సహజభావన గల తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే వారి పోషణ, పెంపకం సక్రమంగా కొనసాగుతుంది.

తల్లిదండ్రులపై దైవకరుణ

పిల్లల పెంపకం చాలా కష్టంతో, సహనంతో కూడుకున్న పని. కాని, దైవం ఎంతో వివేకంతో, కరుణాకటాక్షాలతో, పిల్లలపట్ల తల్లిదండ్రుల మనస్సుల్లో ఎనలేని ప్రేమానురాగాలు, త్యాగగుణాలు, సాటిలేని కరుణానుగ్రహాలు సృష్టించి, ఎంతో కఠినమైన కార్యాన్ని, ఎంతో ఇష్టంగా, సంతోషంగా పసందైన కార్యంగా మలచాడు. పెంపకం సమయంలోని కఠినమైన బాధలు, రేయింబవళ్ళ కష్టాలు సహించి కూడా సంతోషాన్ని, ఆత్మసంతృప్తిని అనుభవిస్తారు. అసంఖ్యాక కష్టనష్టాలు అనుభవించి, ఉదయ సాయంత్రాలు రకరకాల బాధలు భరించి, తమ కంటిపాపలైన సంతానంపై దృష్టిసారించి, వారు మందహాసం చేస్తుంటే ఆనందంతో చిరునవ్వులు చిందిస్తుంటే వారి హృదయం అనిర్వచనీయమైన భావోద్రేకాలతో, అనుపమానమైన ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతుంది. వారి పెంపకంలో ఎదురైన ఆటుపోట్లు, కష్టాలు బాధలన్నీ మరిచిపోయి ఒక విధమైన కమ్మని ఆత్మసంతృప్తిని అనుభవిస్తారు.

పిల్లలపెంపకం- సాధారణ ప్రజలభావన

పిల్లల పెంపకం, వారి ఆలనాపాలనా, వారిని ఉన్నత స్థానాలకు చేర్చాలన్న ఇంగితం ఒక సాధారణమైన ప్రకృతిసిద్ధ విషయం. దైవం దీన్ని ప్రతి మానవుడికీ ప్రసాదించాడు. అతడు ఏ కులానికి, ఏ మతానికి చెందినవాడైనా వాడి మనసులో సహజసిద్ధంగానే ఇలాంటి కోరిక

లుంటాయి. మానవజాతి ఉనికిని, ప్రపంచ అందచందాలను కాపాడడానికి ప్రతి తల్లిదండ్రుల హృదయాల్లో దైవం ఈ భావోద్రేకాలను జనింపజేశాడు. దీనికనుగుణంగానే వారు తమ సంతానాన్ని పెంచి పోషించి జీవన సమరంలో పాలుపంచుకునే స్థితికి చేర్చారు. వారి తరువాత ఆ స్థానాన్ని వారి సంతానం ఆక్రమించాలని, వారి పేరు నిలబెట్టాలని, వారి ధన సంపదలకు వారసులు కావాలని, వారి చరిత్ర, వారి ఆచార సంప్రదాయాలు, నాగరికతల వారసత్వాన్నీ అందిపుచ్చుకోవాలని ఏ తల్లిదండ్రులైతే పిల్లల పెంపకానికి సంబంధించి స్పష్టమైన అవగాహన కలిగిఉండరో, ఇలాంటి చర్యలు, వాటి ప్రతిఫలాలకు సంబంధించి ఎలాంటి వాస్తవ జ్ఞానం కలిగి ఉండరో వారు కూడా తమ సహజసిద్ధ స్వభావంరీత్యా సంతోషంగా తమ పిల్లల పెంపకం బాధ్యతలు చేపడతారు. ఈ బాధ్యతను తమ అదృష్టంగా, సంతోషంగా భావిస్తారు. పిల్లల కోసం ఎలాంటి కష్టనష్టాలు ఎదుర్కోడానికైనా ఎలాంటి త్యాగాలు చేయడానికైనా 'తాము తల్లిదండ్రులం'' అన్న సంబంధమొక్కటే సరిపోతుంది. కుల మతాలతోగాని, నాస్తికత్వంతోగాని దీనికి సంబంధంలేదు. ఏ మతమైనా, అసలు ఏ మతమూ కాకపోయినా 'తల్లిదండ్రులు' అన్న సంబంధమొక్కటే చాలు. తల్లిదండ్రులు ముస్లింలైనా, ముస్లిమేతరులైనా సంతానం పట్ల అందరి హృదయాల్లో ఒకేరకమైన ప్రేమానురాగాలు, భావోద్రేకాలు ఉంటాయి. కాని ఇరువురి ప్రేమానురాగాలకు, ప్రయత్నాలకు మూలం ఒకటే అయినప్పటికీ కార్యాచరణ విధానంలో, త్యాగభావనలో దాని ప్రకారం లభించే ప్రతిఫలంలోని తేడావల్ల అంతులేని వైరుధ్యం ఉంటుంది.

ఇస్లాం బోధనలు తెలియకపోవడంవల్ల లేక తెలిసినా తిరస్కరించే తల్లిదండ్రులు పిల్లల పెంపకం విషయంలో పరిమితంగా ఆలోచిస్తారు.

అంటే ఈ ప్రపంచం, ఇక్కడి ప్రగతి వికాసాలే అసలైనవని ఇక్కడి వరకే ఆలోచిస్తారు. వారు ఇంతకుమించి ఆలోచించలేరు కూడా. మరణం సరిహద్దుకు ఆవలవైపుకు వారి దృష్టిపోదు. ముస్లిమేతర కుటుంబాల్లో కూడా సంతానాన్ని అపూర్వ ప్రేమానురాగాలతో సాకడం జరుగుతుంది. ఇది కేవలం వారి సంతానం అయినందుకు మాత్రమే. పిల్లలకు మంచి సంస్కారం నేర్పడమన్నది, వారిని మంచిపౌరులుగా తీర్చిదిద్దడమన్నది సహజంగానే ఒక మంచి విధానం. అదే స్వభావసిద్ధంగా ప్రతి తల్లిదండ్రుల్లో ఉంటుంది.

అయితే, సంతానం ద్వారా వారి వంశం నిలబడాలని కూడా వారు ఆలోచిస్తారు. సంతానం వారి భావిజీవితంలో సహాయకారిగా పరిణమించి తమకు సుఖసంతోషాలను అందిస్తుంది. వృద్ధాప్యంలో చేదోడువాదోడుగా ఉంటుంది. ఇహలోక జీవితంలోవారి పేరుప్రతిష్టను వ్యాపింపజేస్తుంది. ముస్లిం తల్లిదండ్రులు కూడా ఇవన్నీ ఆలోచిస్తారు కాని, వారి ప్రత్యేకత ఏమిటంటే, వారు ఇదంతా ధార్మిక విధి అని భావించి ధార్మిక ఆదేశాల కనుగుణంగా పిల్లల ఆలనాపాలనా చూస్తారు. అంతేకాకుండా తమ తరువాత తమ ధార్మిక వారసత్వాన్ని, ధార్మిక బోధనలను, తమ ఆచార సంప్రదాయాలను పరిరక్షించే ఇస్లాం ధ్వజవాహకులను వదిలి వెళ్ళాలన్న మహోన్నత లక్ష్యం ఉంటుంది. తమ ఒడిలో సేదదీరిన తమ సంతానం తమ తరువాత తమ ధర్మాన్ని దశదిశలా విస్తరింపజేస్తారన్న ఆశతో, విశ్వాసంతో, సంతృప్తిగా ఇహలోకంనుండి వీడ్కోలు తీసుకుంటారు.

పిల్లలను మంచివారుగా, సౌశీల్యవంతులుగా తీర్చిదిద్దడానికి, వారి ప్రగతివికాసాలకు పూర్తి శ్రద్ధ కనబరచాలి. వారి ఆరోగ్యం, విశ్రాంతి, వారి వికాసాలను గురించి ఆలోచించాలి. వారిని పూర్తిగా పర్యవేక్షిస్తూ సంరక్షిస్తూ

ఉండాలి. వారు పసివారుగా ఉన్నప్పుడు వారి అన్నపానీయాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. వారి వయసునుబట్టి ఆహారాన్ని సమకూర్చాలి. వారి విశ్రాంతికి తగిన ఏర్పాట్లు చేయాలి. తల్లి తన పసిబిడ్డకు పాలుపట్టడం లోనూ, పాలుమరిపించడంలోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. పాలు మరపించిన తరువాత వయసునుబట్టి పిల్లల శారీరక ఎదుగుదల, వారి ఆలోచనల ఎదుగుదల, వారి ఆటలు, అలవాట్లను గమనిస్తూ వారి అన్ని అవసరాలూ తీర్చడానికి ప్రయత్నించాలి. దీని ఫలితంగా వారు పెరిగి పెద్దవారై జీవితాన్ని బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మకంగా గడప గలిగే స్థాయికి చేరుకుంటారు. ఈ అన్నిదశల్లో పిల్లల బాధ్యతను తల్లిదండ్రులు సమర్థవంతంగా, విశాల హృదయంతో నెరవేర్చాలి. వారి అన్నపానీయాలు, వారి వస్త్రాలు, నివాస సదుపాయం, వారి ఆరోగ్యం, వారి చదువు సంధ్యలు, వారి శిక్షణ, సంరక్షణా బాధ్యతలన్నీ సజావుగా, విశాల హృదయంతో నెరవేర్చే బాధ్యత తల్లిదండ్రులపైన్నే ఉంది. పిల్లల కోసం ఖర్చుపెట్టే బాధ్యత తల్లిదండ్రులిద్దరిపై ఉన్నప్పటికీ, సంపాదించే బాధ్యత మాత్రం తండ్రిపైన్నే ఉంది. కుటుంబ పోషణాభారం, కుటుంబీకుల అవసరాలు తీర్చే బాధ్యత దైవం పురుషుడిపైన్నే మోపాడు. ఈ కారణంగానే శారీరకంగా, మానసికంగా పురుషునికి శక్తిసామర్థ్యాలు ప్రసాదించాడు. దైవం స్త్రీని కుటుంబ పోషణకు బాధ్యురాలిగా చెయ్యలేదు. కేవలం కుటుంబ బాధ్యతలు నిర్వహించడం, పిల్లల పోషణ సంరక్షణకు కావలసిన వివేకాన్ని, శక్తియుక్తుల్ని దైవం స్త్రీకి ప్రసాదించాడు. పురుషునికి ఈ శక్తిసామర్థ్యాలు లేవు.

ముస్లిం కుటుంబాల్లో తండ్రి తన పిల్లల హక్కుల్ని సంతోషంగా, విశాల హృదయంతో నెరవేరుస్తాడు. చెమటోడ్చి సంపాదించిన ధనాన్ని

పిల్లల కోసం ఖర్చుపెడుతూ ఒకవిధమైన ఆత్మసంతృప్తికి లోనవుతాడు. ఎన్ని కష్టనష్టాలనైనా సహించి పిల్లల అవసరాలు తీర్చడంలో పితృప్రేమ ప్రధానపాత్ర పోషిస్తుంది.

ధార్మిక స్పృహతో సంతాన బాధ్యతలు

ఒక ముస్లిం తండ్రి తన సంపాదనను, సంతానం కోసం ఎందుకు ఖర్చుపెడతాడంటే, పిల్లలను పెంచిపోషించడం, సహృదయంతో వారి అవసరాలు తీర్చడం ఒక సహజ నైజం. దైవం ప్రతి మానవుడి హృదయంలో ఈ సహజత్వాన్ని సృజించాడు. కాని, ధార్మికుడైన ఒక ముస్లిం తండ్రి మాత్రం, దైవం ఈ సంతానాన్ని నాకు ప్రసాదించి వారి సంరక్షణా బాధ్యతల్ని తనకు అప్పగించాడని భావిస్తాడు. పిల్లలపట్ల సహజ ప్రేమతోపాటు, ఈ ధార్మిక ఆలోచన కూడా తోడై, పిల్లల బాధ్యత ఒక ధార్మిక విధిగా మారిపోతుంది. ఈ ధార్మిక విధి పరలోక సాఫల్యానికి, పరలోక ప్రతిఫలాలకు కారణమవుతున్నందుకు ఈ విధి ఎంతో ప్రీతికరమైపోతుంది. ఒక ముస్లిం దైవం దృష్టిలో ప్రేమపాత్రుడు కావడానికి ఈ విధిని ఒక ఆరాధనగా భావించి సంతోషంగా నెరవేర్చుతాడు. ఎంతో శ్రమపడి, రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన ధనాన్ని సంతానం కోసం ఖర్చుపెట్టి ఎంతగానో సంతోషిస్తాడు. దైవం తనకు ఒక చక్కని బాధ్యతను నెరవేర్చే పని అప్పగించాడని, తాను ఆ దైవాదేశాన్ని నెరవేర్చగలిగానన్న ఆత్మసంతృప్తి అతనికి కలుగుతుంది.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు:

"ఒక బంగారు నాణేన్ని మీరు దైవమార్గంలో ఖర్చుపెట్టారు. మరొక నాణాన్ని ఒక బానిసను విడిపించడానికి వెచ్చించారు. ఒక బంగారు

నాణాన్ని మీరు పేదసాదలకు దానం చేశారు. మరొక నాణాన్ని మీ కుటుంబీకుల కోసం ఖర్చుపెట్టారు. వీటన్నిటిలో అన్నిటికన్నా ఎక్కువ పుణ్యఫలం మీరు కుటుంబం కోసం వెచ్చించిన నాణానికే లభిస్తుంది."

ఈ ఉల్లేఖనానికి సమగ్ర వివరణ హజ్రత్ సూబాన్(రజి) గారి హదీసు ద్వారా లభిస్తుంది. హజ్రత్ సూబాన్(ర)గారి ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ఇలా సెలవిచ్చారు:

"అన్నిటికన్నా అమూల్యమైన నాణెం, ఒక మనిషి తన భార్యాబిడ్డల కోసం ఖర్చుపెట్టిందే. మనిషి ఒక నాణాన్ని దైవమార్గంలో వాహనం కోసం ఖర్చుపెడతాడు. మరొక నాణాన్ని దైవమార్గంలో మిత్రుల కోసం ఖర్చుపెడతాడు. అబూఖలాబ అన్నాయన మధ్యలో కల్పించుకొని ఇలా అన్నారు: 'మీరు భార్యాపిల్లల కోసం ధనాన్ని ఖర్చుపెట్టే విషయం నుండి చర్చను ప్రారంభించి, తరువాత మిగతా విషయాలు చెప్పారు. తమ చిన్నారి పసివాళ్ళ కోసం సంపద ఖర్చుపెట్టే వాడికంటే ఎక్కువ పుణ్యఫలాలు మరెవరికి లభిస్తాయి? దైవం ఆ చిన్నారులను ఇతరుల ముందు చేయిచాపి అర్థించకుండా, సుఖసంతోషాలతో ఉంచుగాక!" (తిర్మిజి)

పిల్లల విద్యాబుద్ధులు శిక్షణ

ముస్లింలు తమ ఇళ్ళలో పిల్లలకు ఇస్లామీయ విలువలు, ధార్మిక బోధన నేర్పించడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. పిల్లలకు ధార్మిక విద్య నేర్పే బాధ్యత పట్ల ఏమరుపాటు వహిస్తూ, తమకు పిల్లల పట్ల అపారమైన ప్రేమానురాగాలున్నాయనుకోవడం ఆత్మవంచనే తప్ప మరేమీకాదు.

పిల్లలకోసం సమయాన్ని వెచ్చిస్తూ వారి శిక్షణను పర్యవేక్షించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక విద్య ప్రాముఖ్యతను కాదనలేం. అలా అని

ధార్మిక విద్యకు తిలోదకాలివ్వడం ఒక ముస్లింకు శోభించని విషయం. విద్యాబుద్ధుల విషయంలో అసాధారణ శ్రద్ధ, వివేకం, సహనం, ధైర్య స్థయిర్యాలు, నేర్పు, నిజాయితీ అన్నిటికీ మించి విద్య పట్ల అపారప్రేమ ముస్లిం కుటంబాల ఔన్నత్యం మరియు ప్రత్యేకత కూడా!

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

"తండ్రి తన సంతానానికి బహూకరించే వాటిలో అన్నిటికన్నా అత్యుత్తమ బహుమానం వారి విద్యాబుద్ధులే." (మిష్కాత్)

పిల్లలను సౌశీల్యవంతులుగా, సద్వర్తనులుగా తీర్చిదిద్దడం కంటే గొప్ప కార్యం మరొకటి లేదు. అత్యుత్తమ స్థాయిలో విద్యాజ్ఞానాలు గరపడమే సంతానానికి తల్లిదండ్రులు చేసే గొప్ప ఉపకారం. నైతిక విలువల్లో వారి స్థాయిని ఉన్నత శిఖరాలకు చేర్చడానికి కృషి చేయడం, సమాజానికి వారి జీవితం ఒక ఆదర్శంగా తల్లిదండ్రులకు నిరంతర పుణ్యఫలం (సదఖ-యె- జారియ) ప్రసాదించే సాధనంగా అలరార గలగాలి.

నిజానికి హక్కులు, బాధ్యతల్లో సమన్వయం ఈ రెండింటి విస్తృత అవగాహన, విశ్వాసం, ఈ రెంటికి సంబంధించి న్యాయంగా, గంభీరంగా ఆలోచించి ఆచరణా రూపం ఇవ్వగలగడమే జీవితంలో ఒక మంచి విప్లవానికి తెరతీస్తుంది. సంతానం తల్లిదండ్రులను గౌరవించాలని, వారిని సేవించాలని, వారిపట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని కోరుకోవడం ఒక సహజ కోరికే. కాని ఈ కోరిక నెరవేరాలంటే తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతలను గుర్తెరగాలి. వాటిపట్ల గంభీరంగా ఆలోచించాలి. తమ వైఖరి ఎలా ఉందో ఒకసారి చిత్తశుద్ధితో సింహావలోకనం చేసుకోవాలి. పవిత్ర

ఖుర్‌ఆన్, సున్నత్ ఆదేశాలు, ఆజ్ఞల మేరకు తమ కుటుంబాన్ని తీర్చి దిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి.

'రబ్బనాహబ్‌లనా మిన్ అజ్‌వాజినా వ జుర్రియాతినా; ఖుర్రత అయ్యునివ్వజ అల్ నా లిల్ ముత్త ఖీన ఇమామా.'

(అల్ ఫుర్‌ఖాన్: 74)

మా ప్రభూ! మా భార్యాపిల్లల ద్వారా మాకు నేత్రానందం కలిగించు. మమ్మల్ని భయభక్తులు గలవారి ఇమామ్‌గా చెయ్యి.

(అంటే- మేము భయభక్తుల్లో అందరినీ మించిపొయ్యేలా, సత్కార్యాల్లో అందరికంటే ముందుండేలా చెయ్యి అని అర్థం.

-: సమాప్తం :-